టీటీడీ అదనపు గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాసు

గురజాల : గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే ప్రభుత్వాలదే బాధ్యత కాదని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చేసేందుకు పాలు పంచుకోవాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా దాతల సహకారంతో స్థలాన్ని కొనుగోలు చేసి అదనపు గదులను నిర్మాణం చేయడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. సోమవారం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమం రెండు సమపాళ్లలో అందుతున్నాయని ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారన్నారు. సుమారుగా రూ.3,400 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. టీటీడీ కల్యాణ మండపం మరమ్మతులకు రూ. 80 లక్షల నిధులు మంజూరు జరిగే విధంగా చూస్తామన్నారు. టీటీడీ అదనపు గదులు ఏర్పాటుకు, స్థలం కొనుగోలు, గదులు ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అభినందనలు తెలిపి వారిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.



టీటీడీ అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మబుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు,మాజీ జెడ్పీటీసీ బి ఇష్టకామిరెడ్డి, మాజీ ఎంపీపీ వి అమరారెడ్డి, పోలు వెంకటరెడ్డి, తదితరులున్నారు.

మూఢవిశ్వాసాలపై అవగాహనకే జన విజ్ఞాన వేదికలు



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కేళం ఆదినారాయణ

మాచర్ల: జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు, ప్రజలకు మూఢనమ్మకాలను పారద్రోలేందుకు జన విజ్ఞాన వేదిక విశేష కృషి సల్పుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు కేళం ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని లైబ్రరీలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెవికెఎస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా స్వర్గీయ గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో గ్రాంధిక భాష నుంచి వ్యవహారిక భాషను ప్రజలకు పరిచయం చేసిన రామ్మూర్తి అన్నారు. ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. రామ్మూర్తి గొప్పతనాన్ని చాటుతూ వివిధ వక్తలు మాట్లాడారు. ఇప్పటికి ఇంకా మూఢవిశ్వాసాలతో ఉన్నవారిలో ఇలాంటి సమావేశాలతో మార్పు తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో డా.కమలాసనరావు, జి కిరీటిరెడ్డి, ఓరుగంటి చెన్నకేశవరావు, చుండూరు సత్యనారాయణ, గ్రంథాలయాధికారి ఫణీభూషణ్, నేరెళ్ళ నాగేశ్వరరావు తదితరులున్నారు.



గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కారెంపూడి: మండలంలోని నరమాలపాడు గ్రామంలో గంగమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. వేద మంత్రాలతో ఆలయ నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే గ్రామ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల గ్రాంటును ప్రకటించారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణాన్ని సంకల్పించిన యాదవ సంఘ పెద్దలు గ్రామస్తులు ప్రభుత్వ విప్ పీఆర్కేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్, ఊటా రాజశేఖరరెడ్డి, గ్రామ సర్పంచ్ గుండ్లకుంట వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ రామ్మడుగు సైదారావు, ఎంపీటీసీ చేవూరి భవాని, మాజీ ఎంపీటీసీ యాకసిరి లక్ష్మీతిరుపతిరావు, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వైఎస్సార్ సీపీతోనే వడియరాజులకు గుర్తింపు

- గతంలో యరపతినేని వడియరాజులకు ఏమి చేశాడు
- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్య


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్య

పిడుగురాళ్ల: తెలుగు దేశం పార్టీలో ఉండే వడియరాజుల నాయకులు వడియరాజులమని చెప్పుకోవడానికి కూడా బయపడి వడ్డెరులమని చెప్పుకుంటున్నారని, కానీ వైఎస్సార్ సీపీలో ఉన్న వడియరాజులు ఖచ్చితంగా మేము వడియరాజులమే అని చెప్పుకునేలా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చేశారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్య అన్నారు. పట్టణంలోని బీసీ సెల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా చేశానని చెప్పుకునే యరపతినేని శ్రీనివాసరావు వడియరాజులకు ఏమీ చేశారని, వారికి ఏ పదవి కట్టబెట్టారని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పిడుగురాళ్ల మార్కెట్ యార్డు పదవిని వడియరాజుల నాయకుడైన కొమెర వెంకటేశ్వర్లకు కేటాయించారని ఆయన తెలియజేశారు. తెలుగు దేశం పార్టీ నాయకులు చాలా తెలివితక్కువగా మాట్లాడుతున్నారని ఆయన ఎద్దేవ చేశారు. చంద్రబాబునాయుడు 40 సంవత్సరాల్లో, 14 సంవత్సరాల్లో యరపతినేని చేయలేనిది నాలుగున్నర సంవత్సరాల్లో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసి చూపించారన్నారు. వడియరాజులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే స్వల్ప మెజార్టీతో ఓడిపోతే ఆదే ఎమ్మెల్యే టిక్కెట్ అభ్యర్థిని ఏసురత్నం నాలుగు సంవత్సరాలు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఇచ్చి, ఇప్పుడు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి చట్ట సభల్లోకి తీసుకుని వెళ్లారని ఆయన తెలియజేశారు. వడియరాజులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టిక్కెట్ ఇస్తామని చంద్రబాబు నాయుడు అసలు ప్రకటించడం లేదని ఆయన అన్నారు. కార్యక్రమంలో వడియరాజుల నాయకులు ఇర్లా గురుస్వామి, వల్లెపు ఏడుకొండలు, మల్లెల రోశయ్య, గంజా గురవయ్య, చల్లా తిరుపతయ్య, వేముల కొండలు ఉన్నారు.

వసతి గృహాల్లోని విద్యార్థులు విద్యలో రాణించాలి

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: ప్రతి విద్యార్థినికూడా క్రమశిక్షణ కలిగిన విద్యను పట్టుదలతో అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ బాల, బాలికల సంక్షేమ వసతి గృహాలను సలహా సంఘంలో భాగంగా ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లోని మరుగుదొడ్లు ,మంచినీటి సౌకర్యం, రికార్డులను పరిశీలించారు. ఏఏ గ్రామాల నుంచి వచ్చారు. మీ క్లాస్‌లో ఎంత మంది ఉన్నారు.మీలోఎవరైన 5వ ర్యాంక్‌లోపు ఉన్నారా.మీకు వచ్చే ఉపాధ్యాయులు ఎలా భోదిస్తున్నారు.వారి భోదన మీకు అర్థం అవుతున్నాయా. హాస్టల్స్‌లో స్టడీఅవర్స్ జరుగుతున్నాయా. వారంవారం మీ దగ్గరకు డాక్టర్ వస్తున్నారా.ప్రతి నెల మీకు కాస్మోటిక్ చార్జిలు ఇస్తున్నారా.హాస్టల్‌ల్లో ఇంకా ఏమైన మెరుగైన సౌకర్యాలు కల్పించాలా అని ఎంపీపీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మీరందరూ ఇష్టంతో ప్రణాళి కాబద్ధంగా చదువుకోవాలని అప్పుడే మీమీ తల్లి దండ్రుల ఆశలను నెరవేర్చి సమాజంలో మంచి స్థానంలో ఉంటారని విద్యార్థినులకు ఆమె సూచించారు. వసతి గృహాల్లో మొత్తం 152 మంది విద్యార్థిని, విద్యార్థులు చేరినట్లు ఎంపీపీకి వివరించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

గురజాల: ఇరువర్గాల మధ్య ఘర్షణజరిగి ఇరువురికి గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు మండల పరిధిలోని తేలుకుట్ల గ్రామంలో ఓ వర్గానికి చెందిన వారు ఏర్పాటు చేసిన అరుగు విషయంలో ఇరువర్గాల మధ్య గత రెండు రోజులుగా గొడవ జరుగుతోంది. సోమవారం సాయంత్రం ఒవర్గానికి చెందిన వారు మరో వర్గానికి చెందిన వారిపై దాడిచేశారు. దాడిలో ఇరువరికి తలకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో గురజాల ఆరోగ్య కేంద్రంకు తరలించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.



















తండ్రి, కొడుకు యాత్రలతో జనం అల్లాడిపోతున్నారు

- చంద్రబాబు వస్తే కరువు..
- లోకేష్ వస్తే వర్షాలు రావు..
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : చంద్రబాబు వస్తే కరువు..లోకేష్ రావడంతో వరణదేవుడు పారిపోవడంతో వర్షాలు పడడంలేదని, ఈ తండ్రి కొడుకుల యాత్రలతో రైతులు, రైతు కూలీలు ఇబ్బందులు పడుతున్నారని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పల్నాడు ప్రాంతంలో ఏమి ఆశించి లోకేష్ పాదయాత్ర చేసుకుంటూ వచ్చాడో కానీ..అప్పటి నుంచి ఇప్పటి వరకు వర్షాలు కురవకుండా పోయాయని ఆయన ఎద్దేవా చేశారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో గ్రామ దేవతల జాతర కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు పాల్గొన్నారు. గంగమ్మ తల్లి, ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కాసు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నేతలు కట్టించిన విద్యుత్ ప్రభలను ఎమ్మెల్యే కాసు సందర్శించారు. ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ...చంద్రబాబుకి కరువుకి విడదీయరాని అనుబంధం ఉందని, లోకేష్ ఎక్కడ పాదం పెడితే అక్కడ వర్షాలు కుర వడంలేదని, ఈ తండ్రి, కొడుకుల యాత్రల వల్ల రాష్ట్రంలో పంటలు పండించేందుకు సాగునీరు లేక రైతులు, రైతు కూలీలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. లోకేష్ పాదయాత్ర చేసుకుంటూ పల్నాడులోకి రాకపోతే ఇపటికే వర్షాలు కురిసి పంటలు రైతులు సాగుచేసేవారన్నారు. రైతులు, రైతు కూలీలు అధైర్యం చెందవద్దని, భగతుడి ఆశీస్సులతో పంటల సాగుకు అవసరమైన వర్షాలు కురిసి సాగునీటి ప్రాజెక్టులు నీటితో నిండుతాయని ఎమ్మెల్యే కాసు ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రం సుభిక్షంగా ఉందని, రాబోయే రోజుల్లో కూడా మన అందరికి మంచి జరుగుతుందని ఎమ్మెల్యే కాసు అన్నారు. కులాలు, మతాలు, పార్టీలు వేరైనా మనమంతా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని, రైతులు, రైతు కూలీలు భగవంతుడి దీవెనలతో చల్లగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

కేసానుపల్లి అభివృద్ధి బాధ్యత నాది...

కేసానుపల్లి అభివృద్ధి బాధ్యత తనపై ఉందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. గ్రామంలో ఇప్పటికే సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు నిర్మించామని, రూ.1.30 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీరు అందించే పనులు చేపడతామన్నారు. గ్రామంలోని అన్ని కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని, గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ కోట కొండలు, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, నాయకులు బొల్లా శ్రీనివాసరావు, చుండు రామారావు, ఉల్లేరు హనుమంతరావు, నెల్లూరి రామారావు, కర్నాటి గాంధీ, జక్కుల వీరాస్వామి, గంగరాజు, సైదయ్య పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇసుక మాయంపై కేసు నమోదు

గురజాల : నగర పంచాయతీలోని జగనన్న కాలనీల్లో గత రెండు రోజులు క్రితం ఇసుక మాయమైనట్లు నగర పంచాయతీ కమిషనర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా 4 టిప్పర్లు ద్వారా ఇసుకను తరలించినట్లు సమాచారం, జగనన్న కాలనీల్లో ఉన్న ఇసుకను అక్రమంగా తరలించారని తరలించిన వారిని అదుపులోకి తీసుకుని అక్రమంగా తరలించిన ఇసుకను తీసుకువచ్చేలా చూడాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వరుణదేవుడి కోసం ప్రత్యేక పూజలు


మల్లిఖార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ


వర్షాలు పడాలని కోరుతూ కృష్ణవేణికి వరదపాయసం పోస్తున్న ప్రధాన అర్చకులు, భక్తులు

సత్రశాల(రెంటచింతల): సకాలంలో వరుణదేవుడు కరుణించి విస్తారంగా వర్షాలు పడి పంటలు సంవృద్ధిగా పండాలని కోరుతూ మండలంలోని అతిపురాతనమైన ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో వరుణదేవునికి, పవిత్ర కృష్ణవేణికి సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, వరద పాయసం నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో ఉదయం 8 గం.లకు వర్షం కోసం భక్తులు, జెట్టిపాలెం గ్రామస్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, పవిత్ర కృష్ణానది వద్ద వరుణదేవునికి వరద పాయసం కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. వరుణ దేవునికి పాయసం పోసి ప్రత్యేక పూజలు చేస్తే వరుణ దేవుడు కరుణించి విస్తారంగా వర్షాలు కురిపించి పైరుపంటలు బాగా పండుతాయని భక్తుల నమ్మకమని అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి, ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అటవీ భూములను కాపాడాలి

అటవీశాఖ జిల్లా అధికారి రామచంద్రరావు


శంకరపురం వద్ద అటవీభూముల్లో పర్యటిస్తున్న అటవీశాఖ జిల్లా అధికారి రామచంద్రరావు

దాచేపల్లి : అటవీ భూములను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖ జిల్లా అధికారి ఎస్. రామచంద్రరావు అన్నారు. మండలంలోని శంకరపురం సమీపంలోని అటవీ భూములను సోమవారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అడవులను పెంచడం మనిషి మనుగడకు మంచిదన్నారు. శంకరపురం అటవీ భూముల్లో అక్రమంగా తవ్వకాలు జరిపితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, రంగు రాళ్ల కోసమని భూముల్లోకి వెళ్లితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. అటవీ భూముల్లో ఎటువంటి తవ్వకాలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని, అటవీ భూముల్లో ఏర్పాటు చేసిన కంటైనర్ హౌస్‌లో తమ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో డిఆర్‌ఓ మురళీ, బీట్ అధికారులు రాకేష్, వెంకట్రావ్, మనోజ్ ఉన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర



పోలేరమ్మ జాతర సందర్భంగా కుంకుమ బండిని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: పట్టణంలోని వడ్డెర పాలెంలో 22వ వార్డులో పోలేరమ్మ జాతరకు కుంకుమ బండిని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆ తరువాత భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో పోలేరమ్మ కుంకుమ బండిని కట్టి పట్టణ ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని నిర్వహించే ఈ జాతర ఎంతో అభినందనీయమని, అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు కురవాలని రైతులు బాగుండాలని ఆయన ఆకాంక్షించారు. కుంకుమ బండి ఊరేగింపు సందర్భంగా ఆయన బండిని ప్రారంభించి ఊరేగింపులో పాల్గొని భక్తులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బోయ రఘురామిరెడ్డి, బత్తుల ఏడుకొండలు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, కౌన్సిలర్ నరసింహారావు, వడ్డెర సంఘానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్ళ కొండలు, చెన్నయ్య, బిజ్జం నాగిరెడ్డి, పుల్లారెడ్డి పోలేరమ్మ దేవాలయ నిర్వాహకులు, భక్తులు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

విజయపురిసౌత్: స్థానిక సాగర్‌మాత దేవాలయం స్నానాల ఘాట్ వద్ద కృష్ణా జలాశయంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైనట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ పి అనిల్‌కుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. మృతుని వయస్సు 25 నుంచి 30 సంవత్సరాలు ఉండవచ్చని, మృతుని ఒంటిపై నల్లని వాకింగ్ ట్రాక్, నల్లని టీషర్ట్ కలిగి ఉన్నాయని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా ముక్త్యాలరాజా 51వ వర్ధంతి


ముక్త్యాలరాజా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీనియర్ జనరల్ మేనేజర్, ఉద్యోగులు

విజయపురిసౌత్: ముక్త్యాలరాజా 51వ వర్ధంతిని విజయపురిసౌత్‌లోని పార్క్ సెంటర్ కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరి ఉద్యోగులు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ముక్త్యాలరాజా విగ్రహానికి కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వి వెంకటరమణ కొబ్బరికాయలు కొట్టి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి మూలపురుషుడు ముక్త్యాలరాజా అని కొనియాడారు. ఆనాడు బంజరు భూములుగా ఉన్న పొలాలు నేడు సిరులు పండిచే భూములుగా మారడానికి ఆయన చేసిన విశేష కృషేనని తెలిపారు. సర్‌ఆర్థర్‌కాటన్ చెప్పినట్లు నీరు ద్రవ రూపంలో ఉన్న బంగారము అనే సూక్తిని బలంగా నమ్మిన వ్యక్తి ముక్త్యాలరాజా అని అన్నారు. తన సొంత నిధులను వెచ్చించి ఖోస్లా కమిటీకి సాగర్ డ్యాం ప్లాన్, అడవిలో రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం చేశారన్నారు. కేసీపీ సీనియర్ డీవీఎం కె ఆనందరెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ కెఎస్ రామానుజాచారి, డీజీఎం రామకోటేశ్వరావు, ఏజీఎంలు ఎస్‌సీఎస్‌వీ రాజు, ఎస్ వెంకటేశ్వరావు, బి శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆఫీసర్ బి వెంకటేశ్వరావు, ఐఎన్‌టీయుసీ అధ్యక్షుడు ఓ శివయ్య, జనరల్ సెక్రటరి జిఎల్ నారాయణ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





కేసానుపల్లిలో గ్రామదేవతల జాతర


విద్యుత్ ప్రభ

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామ దేవతల జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ గంగమ్మ తల్లి, శ్రీ ముత్యాలమ్మ, శ్రీ నిదానంపాటి అమ్మ వారి ఆలయాల్లో ప్రత్యేకంగా పూజలు చేశారు. వర్షాలు విస్తారంగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని కోరుకుంటూ గ్రామ దేవతలకు పూజలు చేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం ప్రత్యేకంగా అలంకరణ చేసిన కుంకుమ బడ్లను దేవాలయాల చుట్టూ తిప్పారు. గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి విద్యుత్ ప్రభలను సందర్శించి కొబ్బరికాయ కొట్టాడు. విద్యుత్ ప్రభలపై సంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


నూతన వ్యాపారాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: పల్నాడు ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అంకమ్మనగర్ కాలనీ సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాటిపర్తి రవీంద్రారెడ్డి ఏర్పాటు చేసిన నూతన వ్యాపారాన్ని ప్రభుత్వ విప్ పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయాల ద్వారా 4 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. కుటీర, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై నిధులు మంజూరు చేసి యువతను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలు ఎంతో ఆర్థికాభివృద్ధిని సాధించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నేరుగా అందజేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు జరుగుతున్న అభివృద్ధి పనులను విస్మరించి ఎల్లోమీడియా ఫేక్ సర్వేలతో చేస్తున్న విష ప్రచారాన్ని ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఇచ్చిన మాటను తప్పకుండా ప్రజలకు మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని 2024లో మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, దుర్గిమార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాతపాటి పిచ్చిరెడ్డి, యర్రెడ్డు శ్రీనివాసరెడ్డి, పేరం చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





కాపు నాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా తాయా


నియోజకవర్గ అధ్యక్షుడిగా తాయా నాయుడు

గురజాల : రాష్ట్ర కాపునాడు ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు కురియాల ఉదయభాస్కర్ ఆదేశాల మేరకు గురజాల నియోజకవర్గ అధ్యక్షుడిగా తాయా వెంకటేశ్వర్లు (నాయుడు)ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాయా నాయుడు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కాపు సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తునన్నారు.



